
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

అనంతపురం
జిల్లా వార్తలు
సోమవారం 24 ఫిబ్రవరి 2025



సభలో..



అనంతపురం ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల అసమర్థ పాలన, సంక్షేమాభివృద్ధి నినాదం, హామీలు కలగలసి గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీలకు తిరుగులేని విజయాన్ని కట్టబెట్టాయి. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో నూ టీడీపీ అభ్యర్థులే విజయం సాధించారు. ఏకపక్షంగా ప్రజలు తీర్పునిచ్చిన నేపథ్యంలో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత ఆయా ఎమ్మెల్యేలపై ఉంది. అలాగే యువగళం పాదయాత్ర జిల్లాలో సాగుతున్న సమయంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత మంత్రి నారా లోకేశ్ అనేక హామీలు ఇచ్చారు. ఇప్పుడు వాటిని ఆయనకు గుర్తు చేసి హామీలు నెరవేర్చేలా చొరవ తీసుకోవాల్సిన బాధ్యత జిల్లాలోని అందరు ఎమ్మెల్యేలపై ఉంది. కాగా జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో వైసీపీ పాలనలో విధ్వంసమైన రోడ్లను బాగు చేయడంలో కూటమి పార్టీల ఎమ్మెల్యేలు సక్సెస్ అయ్యారు. ఇతరత్రా సమస్యలను పరిష్కరించే విషయంలోనూ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఇచ్చిన హామీల్లో కొన్నింటిని నెరవేర్చినప్పటికీ... మిగిలిన వాటిని పూర్తి చేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉంది. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో... ఇచ్చిన హామీలు నెరవేర్చుకునేందుకు అసెంబ్లీలో గళం విప్పడంతోపాటు అభివృద్ధికి బాటలు వేయాల్సిన బాధ్యత ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలపై ఉంది.

నారా లోకేశ్ యువగళం హామీలు



- హంద్రీనీవా విస్తరణ పనులను చేపట్టడంతోపాటు ఆయకట్టుకు నీళ్లు అందిస్తాం.
- అత్యంత వెనుకబడిన రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాలకు సాగునీటిని అందించే జీడీపల్లి, బైరవాన్ తిప్ప ప్రాజెక్టులకు హంద్రీనీవా ద్వారా కృష్ణ జలాలను తరలించే పనులు పూర్తి చేస్తాం.
- ఉరవకొండ నియోజకవర్గంలో 50 వేల ఎకరాలకు నీరు అందించే బిందు సేద్యం పథకాన్ని ప్రారంభిస్తాం.
- జిల్లాకు జీవనాధారమైన హెచ్చెల్సీ ఆధునీకరణ పనులను పూర్తి చేస్తాం.
- హెచ్చెల్సీ నీటి సక్రమ వినియోగానికి రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాల్ మండలంలో ఉంతకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను నిర్మిస్తాం.
- నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం పరిశ్రమలు తీసుకొస్తాం.
- డ్రిప్ సబ్సిడీ పథకానికి పూర్వ వైభవం తీసుకొస్తాం.
- అనంత ఉద్యాన పంటల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం చేసి, అధిక ధరలు అందేలా చర్యలు తీసుకుంటాం.
- శింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలం మర్తాడు వద్ద చీనీ ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పుతాం.

ఉరవకొండ నియోజకవర్గం




- ఉరవకొండలో పూర్తి స్థాయిలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతాం.
- హంద్రీనీవా కాలువ కింద భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందిస్తాం.
- హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు చేపట్టి, నీటి సామర్థ్యాన్ని పెంచుతాం.
- చేనేత సమస్యలను పరిష్కరిస్తాం.

నెరవేర్చినవి..

- ఉదిరిపికొండ నుంచి ఉరవకొండకు తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.16 కోట్లతో పనులు ప్రారంభించారు. 50 శాతం పనులు పూర్తయ్యాయి.
- హంద్రీనీవా కాలువ కింద భూములు కోల్పోయిన రైతులకు రూ.16.07 కోట్లు పరిహారం మంజూరు చేయించారు.
- హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు, కాలువ జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభమయ్యాయి.

రాయదుర్గం..



- బొమ్మనహాల్ మండలం ఉంతకల్లు వద్ద హెచ్చెల్సీకి అనుబంధంగా రిజర్వాయర్ నిర్మాణం.
- కణేకల్లుకు డిగ్రీ కళాశాల మంజూరు.
- బైరవాన్ తిప్ప ప్రాజెక్టుకు కృష్ణాజలాలను తెప్పించడం. ● హెచ్చెల్సీ ఆధునికీకరణ.
- రాయదుర్గంలో అర్ధంతరంగా ఆగిన రైల్వే బ్రిడ్జిల నిర్మాణాల పూర్తి.

నెరవేర్చిన హామీలు...

- కణేకల్లుకు డిగ్రీ కళాశాల మంజూరైంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేందుకు క్షేత్ర స్థాయిలో విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.
- రాయదుర్గం పట్టణంలో అర్ధంతరంగా ఆగిన రైల్వే వంతెనల నిర్మాణానికి రైల్వే శాఖ నిధులు మంజూరు చేసింది. త్వరలో పనులు ప్రారంభించేందుకు టెండర్లు పిలవనున్నారు.

రాప్తాడు..



- పేరూరు డ్యామ్‌కు నీరు తెప్పించడం.
- రాప్తాడులో జాకీ లేదా ఇతర ఏదైనా పరిశ్రమను నెలకొల్పేలా చూడటం.
- నియోజకవర్గంలో ప్రతి చెరువుకు నీరందివ్వడం.
- గ్రామాల్లో రోడ్లు, తాగునీటి సమస్య లేకుండా చూడటం.
- పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి వద్ద రిజర్వాయర్ల నిర్మాణం.

నెరవేర్చిన హామీలు

- పేరూరు డ్యామ్ గేట్ల మరమ్మతుకు రూ.1.20 కోట్లు మంజూరు చేశారు. గేట్ల మరమ్మతు పనులు జరుగుతున్నాయి.
- నియోజకవర్గంలో అన్ని చెరువులకు హంద్రీనీవా, పీఏబీఆర్ కుడి కాలువ ద్వారా నీటి సరఫరా చేసి, తాగు, సాగు నీటి సమస్యకు పరిష్కారం చూపారు.
- పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఉపాధి నిధులతో దాదాపు రూ.60 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టారు.

అనంతపురం..



- అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను తీసుకురావటం.
- నడిమి వంక, మరువ వంకలకు ఇరువైపులా ప్రొటెక్షన్ వాల్ ఏర్పాటు చేసేలా చర్యలు.
- గుత్తి రోడ్డులోని డంపింగ్ యార్డును ఇతర ప్రాంతాలకు తరలించటం.
- అనంతపురం అర్బన్‌లో రోడ్లను బాగు చేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం.
- ఇళ్లు లేని వారికి ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు.
- అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ.
- నగరంలోని పార్కులను పునరుద్ధరించి నగర ప్రజలకు ఆహ్లాద వాతావరణాన్ని కల్పించడం.

నెరవేర్చిన హామీలు

- అనంతపురం నగరం, రూరల్ ప్రాంతాల్లో పలు నూతన రోడ్లు నిర్మించారు.
- అనంతపురం నగరంలో మూడు అన్న క్యాంటీన్లను ప్రారంభించారు.
- నడిమి వంక, మరువ వంక ప్రొటెక్షన్ వాల్ కోసం రూ.125 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావాల్సి ఉంది.
- అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు.
- మీ ఇంటికి - మీ ఎమ్మెల్యే పేరుతో వినూత్న కార్యక్రమాన్ని నిర్వహిస్తూ తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తూ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ముందుకు సాగుతున్నారు.

తాడిపత్రి..



- ముచ్చుకోట రిజర్వాయర్‌కు నీరు తెప్పించడం.
- గ్రానైట్ పరిశ్రమలకు విద్యుత్ చార్జీలు తగ్గించి, పరిశ్రమల నిర్వహణకు పూర్వవైభవం తేవటం.
- నియోజకవర్గంలో నిరుద్యోగ యవతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం.
- నియోజకవర్గంలో డ్రైనేజీ వ్యవస్థను పటిష్టపరుస్తాం.

నెరవేర్చిన హామీలు..

- ముచ్చుకోట రిజర్వాయర్‌కు నీరు తెప్పించారు.
- నియోజకవర్గంలో డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేయడంతోపాటు రోడ్లు బాగు చేశారు. ● పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.

శింగనమల..



- శింగనమల చెరువు ఆయకట్టుకు ప్రతి ఏడాది హెచ్చెల్సీ ద్వారా నీటిని తెస్తాం.
- మిడ్‌పెన్నార్ 5వ దక్షిణ కాలువ చివరి ఆయకట్టు వరకు నీటిని తెచ్చేందుకు కాలువల మరమ్మతులు చేపట్టడం.
- శింగనమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైన్స్ గ్రూప్ ఏర్పాటు.
- ఉల్లికల్లు ముంపు బాధితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద పరిహారం చెల్లింపు.
- గూగూడును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దటం.
- పుట్లూరు మండలంలోని పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులను హెచ్చెల్సీ నీటితో నింపడం.
- సుబ్బరాయసాగర్ నుంచి 29వ డిస్ట్రిబ్యూటరీకి నీటిని విడుదల చేయడం.
- గండికోట నుంచి తాగు, సాగునీటి కోసం పైప్ లైన్ ఏర్పాటు చేయడం.

నెరవేర్చిన హామీలు..

- పుట్లూరు మండలంలోని పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులకు హెచ్చెల్సీ ద్వారా నీటిని అందించారు.
- రోడ్ల మరమ్మతులతోపాటు తాడిపత్రి ప్రధాన రహదారికి మరమ్మతు పనులు చేయించారు.

గుంతకల్లు..



- గుంతకల్లులో కసాపురం రైలు వంతెన, బళ్లారి గేటు వద్ద వంతెలను నిర్మించేందుకు కృషి.
- గుత్తిలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం ఏడాదిలోపు పరిష్కారం.
- గుత్తి చెరువుకు నీరు అందివ్వటం.
- గుంతకల్లులోని స్పిన్నింగ్ మిల్లు స్థానంలో ప్రత్యామ్నాయ ఉపాధి పరిశ్రమను తేవటం.
- పామిడిలో టెక్స్‌టైల్ పార్క్‌ను తెరిపించడం.
- పామిడి మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు రోడ్ల నిర్మాణం చేపట్టడం.
- పామిడి మండలం అక్కాజంపల్లి, తంబళ్లపల్లి గ్రామాల్లో వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్లు, వంతెనల నిర్మాణం.
- గుంతకల్లులో మైనార్టీ వసతి గృహం, కళాశాలను ప్రారంభించటం.

నెరవేర్చిన హామీలు..

- గుత్తిలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం పైపులైన్, బోర్లు ఏర్పాటు చేసి, సమస్యకు పరిష్కారం చూపారు. శాశ్వత పరిష్కారం చూపాల్సి ఉంది. ● గుత్తి చెరువుకు ఈ ఏడాది నీరు తెచ్చారు.
- పామిడి మండలంలోని ఎద్దులపల్లి, కత్రిమల, పాళ్యం గ్రామాల్లో రూ.2.80 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేశారు.

కళ్యాణదుర్గం..



- కళ్యాణదుర్గం మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించటం.
- ప్రతి గ్రామంలోనూ సీసీ రోడ్లు, ప్రధాన రహదారులను బాగు చేయటం.
- నియోజకవర్గంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కల్పన.
- బీటీపీ కాలువ పూర్తి చేసి, నియోజకవర్గంలోని 114 చెరువులకు నీరు అందివ్వటం.

నెరవేర్చిన హామీలు..

- కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యాడ్ స్థలంలో రూ.3 కోట్లతో మున్సిపల్ భవనం నిర్మాణం. రూ.5 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం. రూ.1.80 కోట్లతో డ్రైనేజీ కాలువ నిర్మాణం. టీ సర్కిల్‌లో వాణిజ్య సముదాయ భవనాల నిర్మాణం చేపట్టారు.
- రూ.20 కోట్లతో సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు.
- సొంత నిధులు ఖర్చు చేసి, 200 కంపెనీలతో ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించి, 3వేల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించారు.

కేశవా.. కరుణించవా...

వర్సిటీలను వెంటాడుతున్న జగన్ పాపాలు

రూ.100కోట్ల వేతన బడ్జెట్ బకాయి

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో వర్సిటీల వేతన బడ్జెట్ కేటాయింపులు, మంజూరు అంశాలు ఉద్యోగులను నేటికి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాపాలుగా వెంటాడుతున్నాయి. విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను ఎగ్గొట్టిన విధంగానే వేతన బడ్జెట్ మొత్తాలను మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురిచేశారు. గత ఐదేళ్లలో ఏఒక్క మూడు నెలలు సకాలంలో జీతాలు ఇవ్వలేదని జేఎన్టీయూ, ఎస్కేయూ ఉద్యోగ వర్గాలు గుర్తు చేసుకుని వాపోతున్నాయి. అసెంబ్లీ సాక్షిగా 2024-25 వార్షిక బడ్జెట్‌లో వర్సిటీలకు కేటాయించి నిధుల్లో దాదాపు రూ.100కోట్లు మంజూరు చేయకుండానే జగన్‌రెడ్డి వెళ్లిపోయాడని మండిపడుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం చివరి రెండు త్రైమాసికాల్లో సకాలంలో జీతాలు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నాయి. జిల్లావాసి అయిన ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ స్పందించి నిధులు మంజూరుచేయాలని వేడుకుంటున్నాయి.





అంబరాన్నంటిన సంబరం



జాతీయ జెండాతో చిన్నారి

యువకుల సంబరాలు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): ఐసీపీ చాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై భారత్ ఘన విజయం సాధించడంతో అనంత నగరంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఆదివారం నిర్వహించిన ఈ మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో టీమిండియా చిరస్మరణీయ విజయం సాధించింది. మ్యాచ్ ముగిసిన వెంటనే రాత్రి అభిమానులు జాతీయ జెండాలు పట్టుకుని, వందలాదిగా నగర వీధుల్లోకి వచ్చారు. బైక్‌లలో నినాదాలు చేసుకుంటూ తిరిగారు. క్లాక్‌టవర్ వద్ద పెద్దసంఖ్యలో గుమికూడారు. టపాసులు కాల్చుతూ, కేరింతలు కొడుతూ సంబరాలు చేసుకున్నారు.



హైడ్రామా నడుమ

పరీక్షలు

7

గ్రూప్-2 మెయిన్స్ రాయడానికి అభ్యర్థుల పరుగులు

సెంటర్లకు చేరుకోవడానికి నానా పాట్లు

ఇద్దరు అమ్మాయిలతో..

ఓ అబ్బాయి ప్రేమాయణం

- ఒకరికి తెలియకుండా మరొకరితో..
- మోసంపై నిలదీసిన యువతులు
- విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం
- ఒకరు మృతి.. మరొకరు ఆస్పత్రి పాలు

(వివరాలు 7లో...)

హైడ్రామా నడుమ పరీక్షలు

- గ్రూప్-2 మెయిన్స్ రాయడానికి అభ్యర్థుల పరుగులు
- సెంటర్లకు చేరుకోవడానికి నానా పాట్లు
- సమయం దాటిపోయిందని ఓ అభ్యర్థికి నోఎంట్రీ
- 7293 మందికిగాను 6441 మంది హాజరు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్‌లో కొనసాగిన హైడ్రామాకు ఆదివారం పరీక్షల నిర్వహణతో తెర పడింది. అభ్యర్థుల ఆందోళనలు, కోర్టు విచారణలు, ప్రభుత్వ ప్రకటనల నేపథ్యంలో పరీక్ష నిర్వహణపై శనివారం రాత్రి వరకు సందిగ్ధం కొనసాగింది. అయితే ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణకు గట్టిగా నిర్ణయం తీసుకోవడంతో అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. పరీక్షలు సాఫీగా నిర్వహిస్తామని, వదంతులు నమ్మవద్దని కలెక్టర్ ప్రకటించడంతో ఎక్కడెక్కడో ఉన్న అభ్యర్థులంతా రాత్రికి రాత్రే పరీక్షా కేంద్రాలున్న అనంతపురం వైపు పరుగులు పెట్టారు. ఆదివారం ఉదయం కూడా పరీక్ష కేంద్రాలకు హడావుడిగా చేరుకుని హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకున్నారు.

● 6441మంది హాజరు

గ్రూప్-2 పరీక్షలు ఆదివారం జిల్లాకేంద్రంతోపాటు రూరల్ పరిధిలోని 14కేంద్రాలలో కొనసాగాయి. 7293మంది అభ్యర్థులకుగాను 6441 మంది హాజరై పరీక్షలు రాశారు. హాజరు శాతం 88.31గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఉదయం 10గంటల నుంచి 12-30 వరకు జరిగిన పరీక్షలకు 7293మందికిగాను 6463మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం5-30వరకు జరిగిన పరీక్షకు 6461మంది మాత్రమే హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద భారీ పోలీస్ బందోబస్తు చేపట్టారు. చిన్నపిల్లలతో వచ్చిన తల్లులు, బాలింతలు తమ పిల్లలను కుటుంబసభ్యులు వద్ద వదిలివెళ్లగా ఆపిల్లలను కేంద్రాల వద్ద సముదాయించడం కనిపించింది. పరీక్ష కేంద్రాలను కలెక్టరు వినోద్‌కుమార్, జాయింట్‌కలెక్టరు శివనారాయణశర్మ ఇతర జిల్లాశాఖల ఉన్నతాధికారులు తనిఖీలు చేశారు.


ఆర్ట్స్‌కళాశాలలో అభ్యర్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న మహిళా పోలీసు

అయ్యో.. పాపం గణేష్
విజయవాడ నుంచి వచ్చినా నోఎంట్రీ



అనంతపురం నగరానికి చెందిన గణేష్ గ్రూప్-2 పరీక్ష రాయాల్సి ఉంది. అయితే రోస్టర్ విషయంలో అన్యాయం జరుగుతోందని, సవరించి పరీక్షలు నిర్వహించాలని జరుగుతున్న ఉద్యమంలో గణేష్ కూడా ఉన్నారు. పరీక్షలు ఆపాలని శనివారం విజయవాడలో చేపట్టిన ఆందోళనలో గణేష్ పాల్గొన్నారు. పరీక్షలు వాయిదా పడే అవకాశం ఉందని ప్రచారం జరగడంతో కొంత నిర్లక్ష్యంగా అక్కడే ఉన్నారు. రాత్రి పరీక్షలు జరుగుతాయనడంతో విజయవాడ నుంచి ప్రత్యేకవాహనాన్ని బాడుగకు తీసుకొని పరీక్ష రాయడానికి అనంతకు వచ్చారు. శారదానగర్‌లోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రం వద్దకు చేరుకున్నారు. అప్పటికే 9-50గంటల అయ్యిందని నిబంధనల మేరకు గడువు ముగిసిందని పరీక్ష కేంద్రంలోకి పోలీసులు, ఇతర తనిఖీ అధికారులు అనుమతించలేదు. ఇంకా రెండు నిమిసాలు ఉందని వాదనకు దిగినా వెనక్కి పంపించారు. దీంతో గణేష్ మీడియాతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడేళ్లుగా ప్రిపేర్‌అవుతూ వస్తున్నానని, పరీక్షలు వాయిదా వేయాలని ఏపీపీఎస్సీ వద్ద జరిగిన ఆందోళనలో పాల్గొనడానికి శనివారం విజయవాడ వెళ్లానన్నారు. వాయిదా పడతాయని ప్రచారం జరగడంతో విజయవాడలోనే ఉన్నానన్నారు. పరీక్షలు యథాతథంగా జరుగుతాయని రాత్రికి తెలియడంతో కారును అద్దెకు తీసుకొని వచ్చానని, ఇక్కడ ఇంకా రెండు నిమిషాలు సమయం ఉన్నా లోపలికి అనుమతించలేదని వాపోయాడు. ఈఅన్యాయంపై కోర్టుకు వెళతానని తెలిపారు.

కానిస్టేబుల్ చొరవతో పరీక్ష రాసిన అభ్యర్థి

శ్రీ సత్యసాయి జిల్లా అమడగూరు మండలానికి చెందిన ఆంజనేయులు అనే అభ్యర్థి గ్రూప్-2 పరీక్ష రాయడానికి ఎస్ఎస్‌బీఎన్ కేంద్రానికి వచ్చాడు. పరీక్షకేంద్రంలోకి వెళ్లారు. అక్కడ హాల్‌టిక్కెట్ నెంబర్‌మేరకు పరీక్షహాల్‌ను చూసుకున్నాడు. అయితే అక్కడ తన నెంబర్ ఎక్కడా కనిపించలేదు. ఈ విషయమై అక్కడే ఉన్న అధికారులను అడగగా హాల్‌టిక్కెట్‌ను చూసి, అది గ్రూప్-1 పరీక్ష హాల్‌టిక్కెట్ అని గుర్తించారు. గతంలో కూడా ఇదే సెంటర్‌లో గ్రూప్-1 పరీక్ష రాయడంతో అదే హాల్‌టిక్కెట్‌తో ఇపుడు వచ్చినట్లు గుర్తించారు. అప్పటికి పరీక్షా సమయానికి ఇంకా 12 నిమిషాలు మాత్రమే ఉంది. ఈ విషయం అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ జాఫర్ తెలుసుకుని, అభ్యర్థి ఆంజనేయులును సమీపంలో ఉన్న ఎస్పీ బంగ్లాకు తీసికెళ్లి అక్కడ ఆన్‌లైన్‌లో గ్రూప్-2 హాల్‌టిక్కెట్ తీయించి గడువులోగా పరుగులు తీయించుకుంటూ పరీక్ష కేంద్రంలోకి పంపించారు.


పరీక్ష కేంద్రంలోకి పరుగులు తీస్తున్న ఆంజనేయులు


పీవీకేకే కళాశాల సెంటర్‌లో గ్రూప్-2 పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టరు వినోద్‌కుమార్


పరుగో.. పరుగు..

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ


పరీక్షకేంద్రంలో ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గ్రూప్-2 పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ జగదీష్ పరిశీలించారు. స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాల, ఆర్ట్స్ కళాశాల, నలంద, ఎస్వీ డిగ్రీ కళాశాల, జేఎన్టీయూ, రైవర్, అనంతలక్ష్మి, కేఎస్ఎన్ డిగ్రీ కళాశాలల్లో జరుగుతున్న గ్రూప్-2 మెయిన్స్ పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. బందోబస్తులో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అభ్యర్థుల సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షా కేంద్రాలలోనికి తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచే విధంగా చర్యలు చేపట్టారు. ఉదయం 10 నుంచి 12.30గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు గ్రూప్-2 పరీక్షలు కొనసాగాయి.

చెరువులో పడి వ్యక్తి మృతి

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠలరాయుని చెరువులో పడి ఆదివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. అప్‌గ్రేడ్ స్టేషన్ ఎస్ఐ రమణారెడ్డి, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. కుమ్మవాండ్లపల్లికి చెందిన శ్రీనివాసులు (35) గుజరీ వ్యాపారం చేసుకుని జీవనం సాగిచేవాడు. మనస్పర్థల కారణంగా ఐదేళ్ల క్రితం భార్యతో విడిపోయి, అదే గ్రామంలో ఉన్న చెల్లెలు ఇంటిలో ఉండేవాడు. మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం విఠాలరాయుని చెరువులో శవమై తేలాడు. అతిగా మద్యం సేవించేవాడని, మద్యం మత్తులో ప్రమాద వశాత్తు చెరువులో పడి మృతిచెంది ఉంటాడని, అతడి చెల్లెలు నందిని ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయంలో చోరీ
10 తులాల వెండి ఆభరణాలు, నగదు అపహరణ


ఆభరణాలు ఎత్తుకెళ్లడంతో బోసిపోయిన విగ్రహం

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల వద్ద మూష్టురుకు వెళ్లే రహదారిలో వెలసిన వీరముద్దప్పస్వామి, గంగమ్మ ఆలయంలో చోరీ జరిగినట్లు ఆదివారం వెలుగు చూసింది. ఆలయ పూజారి పుల్లన్న తెలిపిన మేరకు.. ప్రతిరోజూ సాయంత్రం ఆలయాన్ని మూసివేసి ఉదయం వచ్చి పూజ కార్యక్రమాలు చేస్తానన్నారు. శనివారం సాయంత్రం పూజలు చేసి వసంతపురంలో ఉన్న తన ఇంటికి వెళ్లానన్నారు. ఆదివారం ఉదయం వచ్చి చూడగానే ఆలయం గేటు తెరిచే ఉండటంతో లోపలికి వెళ్లి చూశానన్నారు. హుండీని పగులగొట్టి అందులో ఉన్న ఆరునెలల నగదు, స్వామికి అలంకరించిన 10 తులాల వెండి ఆభరణాలు అపహరించినట్లు గుర్తించానని తెలిపారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందిచానని పేర్కొన్నారు. రూరల్ పోలీసులు ఆలయం వద్దకు వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాము కాటుతో బాలిక మృతి


ప్రీతి (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడాపురం తూర్పుబావులకు చెందిన ప్రీతి (8) అనే బాలిక పాముకాటుతో మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. తూర్పుబావులకు చెందిన విశాలాక్షి, రాజశేఖర్ దంపతుల కుమార్తె ప్రీతి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి చదువుతోంది. శనివారం రాత్రి ఇంటి ముందు బాలిక ఆడుకుంటుండగా పాము కాటుకు గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం పుట్టపర్తికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. బాలిక మృతితో కుటుంబసభ్యులు తీవ్రవిషాదంలో మునిగిపోయారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరునాళ్ల
స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు.. స్వామి నామస్మరణతో మార్మోగిన ఆలయం


పూజలందుకుంటున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగుబంగారంగా విరజిల్లుతున్న గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాళ్ల నాలుగో ఆదివారం వైభవంగా జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. బియ్యం, బేడలు, కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాప్తాడు, రాయదుర్గం ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు, టీడీపీ సీనియర్ నాయకులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, మాజీ జడ్పీటీసీలు విశాలాక్షి, రామలింగారెడ్డి తదితరులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన రాతి దూలం లాగుడు పోటీల్లో నంద్యాల జిల్లా వృషభాలు విజయం సాధించాయి. పోటీలను రాప్తాడు, రాయదుర్గం ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు ప్రారంభించారు. నంద్యాల జిల్లా పీఆర్ పల్లెకు చెందిన రెడ్‌మిర్చి పఠాన్ వృషభాలు 3,518 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. గార్లదిన్నెకు చెందిన కుమ్మరి రామాంజనేయులు వృషభాలు 3,513 అడుగులు లాగి రెండో స్థానంలో నిలిచాయి. తాడిపత్రి కొండ గోపాల్‌కు చెందిన వృషభాలు 3,485 అడుగులు లాగి మూడో స్థానంలో, నంద్యాల జిల్లా పీఆర్‌పల్లెకు చెందిన నాగయ్య వృషభాలు 3,265 అడుగులు లాగి నాల్గవ స్థానం, అనంతపురం టౌన్‌కు చెందిన ఓబుళపతి ఆచారి వృషభాలు 3,158 అడుగులు లాగి ఐదో స్థానంలో, సోములదొడ్డి రామసుబ్బారెడ్డి వృషభాలు 3,121 అడుగులు లాగి ఆరో స్థానంలో నిలిచాయి. ఆయా వృషభాల యజమానులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

అశ్వత్థ నారాయణస్వామి తిరునాళ్ల..

పెద్దపప్పూరు, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అశ్వత్థనారాయణస్వామి తిరుణాల ఆదివారం వైభవంగా జరిగింది. మాఘమాసం సందర్భంగా అశ్వత్థనారాయణస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు తలనీలాలు సమర్పించుకొని పుణ్యస్నానాలు చేశారు. ఎలాంటి ఘటనలు జరగకుండా సీఐ వెంకటసుబ్బయ్య, ఎస్ఐ నాగేంద్రప్రసాద్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.


ప్రత్యేక అలంకరణలో అశ్వత్థ నారాయణస్వామి

ఇద్దరు అమ్మాయిలతో..

- ఓ అబ్బాయి ప్రేమాయణం
- ఒకరికి తెలియకుండా మరొకరితో..
- మోసంపై నిలదీసిన యువతులు
- విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం
- ఒకరు మృతి.. మరొకరు ఆస్పత్రి పాలు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): ఇద్దరు అమ్మాయిలు ఒకరికి తెలియకుండా మరొకరు ఒకే అబ్బాయిని ప్రేమించారు. అయితే కొన్నాళ్లకు తామిద్దరూ ప్రేమిస్తున్నది ఒక్కరినే అని తెలుసుకుని తల్లడిల్లిపోయారు. మోసం చేస్తున్నావని యువకున్ని నిలదీశారు. వాదులాడారు. చివరకు ఆత్మహత్యకు యత్నించారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ఒకరిది స్కూల్ ప్రేమ... మరొకరిది కాలేజీ ప్రేమ..

శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం గరిశనపల్లికి చెందిన దివాకర్, ముదిగుబ్బ మండల కేంద్రానికి చెందిన రేష్మ చిన్నప్పుడు ఒకే స్కూల్‌లో చదువుకున్నారు. అప్పటి నుంచి కొనసాగిన పరిచయం తర్వాత ప్రేమగా మారింది. అయితే రేష్మకు రెండేళ్ల కిందట పెళ్లయింది. కొంత కాలానికే భర్తతో కొట్లాడి వదిలేసింది. ప్రస్తుతం పుట్టింట్లో ఉంటోంది. దివాకర్ ప్రస్తుతం బళ్లారి రోడ్డులోని కేబీఎఫ్ ఫైనాన్స్‌లో పని చేస్తున్నాడు. ఆ క్రమంలో మళ్లీ దివాకర్‌తో టచ్‌లోకి వచ్చింది. మళ్లీ ప్రేమకథ ప్రారంభమైంది. మరోవైపు కణేకల్లు మండలం యర్రగుంటకు చెందిన శారద(21)నగరంలోని నలంద కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. ఆదిమూర్తినగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటోంది. కంప్యూటర్ కోర్స్ కోసం ఓ ఇన్‌స్టిట్యూట్‌కు వెళ్లేది. అక్కడికి దివాకర్ సోదరి కూడా వెళ్లేది. ఈక్రమంలో వారిద్దరికి స్నేహం ఏర్పడింది. సోదరి ద్వారా దివాకర్‌కు శారద పరిచయమైంది. అది ప్రేమకు దారి తీసింది. అలా దివాకర్ ఒకరికి తెలియకుండా మరొకరితో ప్రేమాయణం నడిపాడు.

ఇన్‌స్టాగ్రామ్‌తో తెలిసింది...

దివాకర్‌ను ప్రేమించే ఆ ఇద్దరు యువతులు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఒకరికొకరు పరిచయమయ్యారు. అలా ఇద్దరూ రకరకాల ఊసులు చెప్పుకున్నారు. చివరికి బాయ్‌ఫ్రెండ్ గురించి కూడా చెప్పుకుని, అతడి ఫొటో షేర్ చేసుకున్నారు. ఫొటో చూసుకుని ఇద్దరూ ఖంగుతిన్నారు. ఇదంతా రెండు మూడు నెలల కిందట జరిగింది. అప్పటి నుంచి ఇద్దరూ తాము మోసపోయామనుకున్నారు. అతడితో గొడవ పడుతూ వచ్చారు. ఆ సమస్యను ఎవరికీ చెప్పుకోలేక, అతడితో విభేదించలేక వాదులాడుతూ వచ్చారు.

పెళ్లి కోసం గొడవ పడి..

రెండు రోజుల కిందట రేష్మ కుటుంబసభ్యులతో గొడవపడి బయటకు వచ్చింది. శనివారం రాత్రి శారద వద్దకు వెళ్లింది. అదే రోజు రాత్రి ఇద్దరూ దివాకర్‌కు ఫోన్ చేశారు. 'మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి...నాకు అవసరం లేదు'అని అతడు అన్నట్లు సమాచారం. దీంతో ఇద్దరూ మనోవేదన చెంది ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకున్నారు. హాస్టల్ నుంచి శారద, రేష్మలు జీసస్‌నగర్‌లో నివాసముంటున్న దివాకర్ గది వద్దకు ఆదివారం ఉదయం వెళ్లారు. చివరగా తమ ప్రేమ గురించి వాదించారు. ఇద్దరినీ ప్రేమించి మోసం చేస్తావా..? అంటూ నిలదీశారు. నన్ను టెన్షన్ పెట్టకండి వదిలేయండి అన్నాడు. పెళ్లి చేసుకోమని కోరారు. దీంతో దివాకర్ మీవాళ్లతో మాట్లాడండి అన్నాడు. వారు వారి వాళ్లకు ఫోన్ చేయకుండా అక్కడి నుంచి బయటకెళ్లారు. ఇద్దరూ కురులకు వాడే ద్రావకం బాటిళ్లు రెండు తీసుకుని ఆర్టీఓ కార్యాలయం సమీపంలోకి వెళ్లారు. 10.30గంటల సమయంలో తాము విష ద్రావకం తాగామని దివాకర్‌కు ఫోన్ చేసి చెప్పారు. దీంతో ఆందోళన చెందిన దివాకర్ ఎక్కడున్నారని అడిగితే తొలుత చెప్పకపోయినా, తర్వాత కాసేపటికి చెప్పారు. దీంతో దివాకర్ అక్కడికి వెళ్లాడు. అప్పటికే శారద అపస్మారక స్థితిలో ఉంది. ఇద్దరినీ చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లే క్రమంలో...వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆసుపత్రికి తీసుకెళ్లిన కొంతసేపటికే శారద మృతి చెందింది. రేష్మ చికిత్స పొందుతోంది. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దివాకర్‌ను విచారిస్తున్నారు.


దివాకర్

తోలుబొమ్మల కళాకారిణికి అవార్డు


కేంద్రమంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న దళవాయి శివమ్మ

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మలకుంట గ్రామానికి చెందిన తోలుబొమ్మల కళాకారిణి దళవాయి శివమ్మకు కేంద్ర ప్రభుత్వ పరంపరాగత్ అవార్డు దక్కింది. హర్యానా రాష్ట్రంలోని సూరజ్‌కుండ్‌లో కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఇంటర్నేషనల్ క్రాఫ్ట్ మేళాలో ప్రదర్శనకు ఆమెను ప్రశంసాపత్రంతో సత్కరించారు. కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ నుంచి ప్రశంసాపత్రాన్ని దళవాయి శివమ్మ అందుకున్నారు.

26న బ్యాడ్మింటన్ టోర్నీ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మెమోరియల్ రాయలసీమ స్థాయి ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఈనెల 26న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గణేష్, సాయితేజ, కిశోర్ తెలిపారు. కల్లూరు ఆర్ఎస్‌లోని శ్రీశిశుమందిరం స్కూలులో సాయంత్రం 4 గంటలకు పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులు ఈనెల 25వతేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 8247203702, 9398164633, 7013216692 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

శంకర్ నాయక్‌పై చర్యలు తీసుకోవాలి

రామగిరి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్‌పై సమగ్రవిచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములునాయక్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. శంకర్‌నాయక్ తీరు గిరిజన జాతికే అవమానకరమని అన్నారు. విజయవాడలో వ్యభిచార గృహంలో అరెస్టు అయిన శంకర్‌నాయక్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఈయన పదవిని అడ్డంపెట్టుకుని పుట్టపర్తిలోని సత్యసాయి ఆసుపత్రికి ఎదురుగా ఒక అమాయక గిరిజనుడిని బెదిరించి స్థలాన్ని కబ్జాచేశాడని ఆరోపించారు. వైసీపీ హయాంలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ అనేక మందిని మోసం చేశాడని, అక్రమాలకు పాల్పడ్డాడని పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షలు లైవ్ స్ట్రీమింగ్ : ఆర్ఐఓ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల్లో అన్నిగదుల్లో సీసీల లైవ్ స్ట్రీమింగ్ ఉంటుందని పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్, ఆర్ఐఓ వెంకటరమణ నాయక్ తెలిపారు. ఆదివారం ఇంటర్ పబ్లిక్ పరీక్షాకేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, కస్టోడియన్లు, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లతో ఒకేషనల్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఆర్ఐఓ మాట్లాడుతూ... పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. 63 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుంటే లైవ్ స్ట్రీమింగ్ ఉంటుందని నిత్యం గమనిస్తూ ఉండాలన్నారు. పరీక్షాకేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు నిషేధం అన్నారు. ఫొటో గుర్తింపు కార్డు తప్పనిసరిగా ధరించాలన్నారు. పరీక్ష సిబ్బంది, ఇతర స్టాఫ్‌ను సైతం క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే కేంద్రాలోకి అనుమతించాలని ఆదేశించారు. కేంద్రాల్లో తగినంత వెలుతురు, తాగునీరు, ఫ్యాన్లు ఉండేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు సాలాబాయి, నాగరత్నమ్మ, సుభద్రమ్మ, రంగయ్య పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో చేపట్టిన పారిశుధ్యం ప్రత్యేక డ్రైవ్‌కు అనూహ్య స్పందన లభించిందని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు పేర్కొన్నారు. జిల్లాలోని 575 పంచాయతీల్లో ఆదివారం చెత్త సేకరణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఇళ్ల నుంచి చెత్తను సేకరించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా తగిన చర్యలు చేపట్టినల్లు తెలిపారు. ఇదే తరహాలో తరచూ స్థానిక సిబ్బంది పారిశుధ్య చర్యలు కొనసాగించేలా స్థానిక ఈఓఆర్డీలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లాలోని మూడు మండలాల్లో జరుగుతున్న పారిశుధ్యం ప్రత్యేక డ్రైవ్‌ను డీఎల్‌పీఓ విజయ్‌కుమార్‌రెడ్డి ఆదివారం పరిశీలించినట్లు తెలిపారు. నార్పల మండలంలోని నాయనపల్లి, తాడిపత్రి మండలం భోగసముద్రం, పుట్లూరు మండలం కందికాపుల పంచాయతీల్లో తనిఖీలు చేపట్టి, సిబ్బందికి పలు సూచనలు చేసినట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఎన్నిక


ఉమ్మడి అనంత జిల్లా ఎక్సైజ్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. స్థానిక అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్రనాయకుల ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఎక్సైజ్ సీఐ జయనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎక్సైజ్ ఎస్ఐ సయ్యద్ జాకీర్ హుస్సేన్‌లను ఎంపిక చేశారు. అలాగే అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నరేష్‌బాబు, ఉపాధ్యక్షుడిగా సృజన్ బాబు, కార్యనిర్వాహక కార్యదర్శిగా శివసాగర్, సహాయ కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా జయనరసింహ, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సునంద, రామ్మోహన్, గురునాథ్‌రెడ్డి, సోమశేఖర్, ఉమామనోహర్ రాజు, భీమప్ప, పృథ్విరాజ్, రాజేంద్రప్రసాద్, సత్యనారాయణలను ఎంపిక చేశారు. నూతన కార్యవర్గం సభ్యులకు ఆ శాఖ అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.

జీవితాల్లోంచే కథలు పుడతాయి
సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్


మాట్లాడుతున్న సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): 'కథలు ఎక్కడి నుంచో కాదనీ, మనతోపాటు మన చుట్టుపక్కలవారి జీవితాల్లోంచే దొరుకుతాయ'ని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ పేర్కొన్నారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక లలితకళాపరిషత్ మినీహాల్‌లో నిర్వహించిన అనంత కథా కార్యశాలకు కెంగార మోహన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆధునికుడు నేల నుంచి నీటిని పిండుతున్నాడనీ, ఖనిజాలు తవ్వుతున్నాడని, అభివృద్ధి పేరుతో చేసే విధ్వంసాలు మామూలువి కాదన్నారు. ఈ కోణంలో కథలు రావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సీనియర్ రచయిత సింగమనేని నారాయణ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి నేతలు అంకె శ్రీనివాస్, ప్రజ్ఞా సురేష్, యమునారాణి, రచయిత్రి శశికళ, డాక్టర్ ప్రగతి, శ్రీనివాసమూర్తి, సాహితీకారులు ఉప్పరపాటి వెంకటేశులు, రాజారామ్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ఆత్మకూరు ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మాఘ మాస చివారి ఆదివారం ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. మూల విరాట్‌కు క్షీరాభిషేకం, బంగారు కవచసేవ, పల్లకి సేవ ఆకుపూజ చేశారు. వందల మంది భక్తులు స్వామి వారి దర్శనం కోసం తరలివచ్చారు. అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆలయ కార్యనిర్వహణా ధికారి బాబు, ప్రధాన అర్చకులు రాముస్వామి తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవాపై మాట్లాడే అర్హత 'తోపుదుర్తి'కి లేదు: బండి పరశురాం

అనంతపురం విద్య, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్ పనుల గురించి మాట్లాడే అర్హత మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి లేదని టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురాం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాప్తాడు నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు నీరందిస్తామని 2019 ఎన్నికల్లో జగన్‌తో చెప్పించారన్నారు. రాప్తాడులో మూడు ప్రాజక్టులు కట్టిస్తామని ప్రగల్భాలు పలికారని, అయితే మూడు కాలువలు కూడా తవ్వలేదని ఎద్దేవా చేశారు. 2019 నుంచి 2024 వరకూ ఏ ఒక్క రైతు బాగుపడిన దాఖలాలు లేవన్నారు. ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నంతకాలం లో...ఆయన కుటుంబీల దోపిడీకే కాలం సరిపోయిందన్నారు. పచ్చని గ్రామాల్లో కులాల మధ్య చిచ్చు పెట్టడం మానుకోవాలని హితవు పలికారు. పరిటాల సునీత ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో సీసీ రోడ్లు, తారు రోడ్లు వేయించి అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రకాష్ రెడ్డి రాజకీయాలు చేయడం, డ్రామాలు కట్టడం మాని నియోజవకర్గ అభివృద్ధి కోసం పరిటాల కుటుంబానికి సహకరించాలని కోరారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిల్పారామంలో భరతనాట్య నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. శిల్పారామం ఆధ్వర్యంలో ఆదివారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నగరానికి చెందిన సుధీర బృందంచే కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. కృష్ణం కలయసఖి, ఓడనుజరిపే, జైజై హనుమాన్, చేరి యశోదకు, నను బ్రోవ వంటివాటిని కళాకారులు ప్రదర్శించారు. శిల్పారామం ఎఓ క్రిష్ణప్రసాద్, కళాకారులు సుధీర, శ్రద్ధ, దివ్యశ్రీ, కావ్య, హిమజ, మేఘన, అర్చన, అలంక్రియా పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

● నాలుగోతరగతి ఉద్యోగుల సమాశంలో ఎన్జీఓ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ ఎన్జీఓ నాయకులు కోరారు. ఏపీ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు కుళ్లాయప్ప, జిల్లా అధ్యక్షుడు గౌస్‌పీరా ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎన్జీఓ హోంలో నాలుగోతరగతి ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్ మాట్లాడుతూ... నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ముందుంటామని తెలిపారు. ఏపీ ఎన్జీఓ నగర అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముక్తియార్, జిల్లా కార్యదర్శి పెద్దన్న, సంయుక్త కార్యదర్శులు మహబూబ్‌భాషా, జయచంద్ర, షెక్షావలి, నగర అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్‌కుమార్, ప్రకాష్, నాగభూషణం, మహేష్, స్వర్ణలత, ఆదిలక్ష్మి, మారుతిప్రసాద్, శివప్రసాద్ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తొలగించాలి : సీపీఎం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నగర శివారులో గుత్తిరోడ్డులో ఉన్న డంపింగ్ యార్డును తొలగించి, ప్రజల ప్రాణాలను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు ఆదివారం డంపింగ్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా నల్లప్ప మాట్లాడుతూ... నగరంతోపాటు చుట్టూ ఉన్న మేజర్ గ్రామ పంచాయతీల నుంచి రోజుకు 60 టిప్పర్లు, 100 ట్రాక్టర్లతో చెత్తా చెదారాన్ని తీసుకువచ్చి డంపింగ్ యార్డులో వేస్తున్నారని అన్నారు. ఇంత పెద్దఎత్తున వస్తున్న చెత్తను ప్రాసెసింగ్ చేయ కుండా గుట్టలు గుట్టలుగా వేయడంతో దాదాపు 20 ఎకరాల విస్తీర్ణంలో 80 అడుగుల ఎత్తు మేరకు చెత్త పేరుకుపోయిందన్నారు. తీవ్ర దుర్వాసనతో కూడిన పొగ, కలుషితమైన గాలితో నగరంతో పాటు రాజీవ్ కాలనీ పంచాయతీ, నారాయణపురం పంచాయతీల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన

● ఎన్‌ఆర్‌ఐ విద్యాసంస్థల చైర్మన్



స్కూల్ ప్రారంభోత్సవంలో చైర్మన్ తదితరులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అత్యున్నత ప్రమాణాలతో విద్యాబోధన అందించేలా ఎన్‌ఆర్‌ఐ అమెరిన్ ప్రీ స్కూల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఎన్‌ఆర్‌ఐ విద్యాసంస్థల చైర్మన్ వెన్నపూస విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కళ్యాణదుర్గం రోడ్డులో ఎన్‌ఆర్‌ఐ అమెరిన్ ప్రీ స్కూల్‌ను ఆదివారం చైర్మన్ వెన్నపూస విశ్వనాథరెడ్డి, ఎండీ చంటిరెడ్డి, వైస్ చైర్మన్ దివ్యారెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ... ఉన్నతమైన ప్రమాణాలతో ప్రీ స్కూల్ (ఏసీ క్యాంపస్)ను ప్రారంభిస్తున్నామన్నారు. ప్రీ- కేజీ, ఎల్‌కేజీ, యూకేజీ, డే-కేర్ సర్వీసులు అందిస్తామన్నారు. కేవలం తరగతికి 20 మంది విద్యార్థులతో ఏప్రిల్ నుంచి తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అత్యుత్తమ టీచర్లతో బోధన అందిస్తామని, ట్రాన్స్‌ఫోర్ట్ సదుపాయం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండర్ వెన్నపూస సురేష్‌రెడ్డి, డైరెక్టర్ అనూషరెడ్డి, యాజమాన్య ప్రతినిధులు వెంకటేష్, నవీనారెడ్డి, శైలజ, వనజ, ఇతర సిబ్బంది వెంకటేష్, అంబికారెడ్డి, అపర్ణరెడ్డి, రజనీష్, శ్రీప్రియారెడ్డి, విద్యారెడ్డి, హర్షవర్ధిని తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠుడికి రావణ వాహన సేవ



దశకంఠ వాహనంపై ఊరేగుతున్న శివపార్వతులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఆదివారం దశకంఠ రావణ బ్రహ్మ వాహనంపై శివపార్వతులు ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయంలో ఉదయం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. అనంతరం ఆలయంలోని శివలింగానికి విశేష అలంకరణ చేసి, ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో దీక్షాహోమం చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన రావణబ్రహ్మ వాహనంపై స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ఆశీనులను చేసి మొదటిరోడ్డు, రెండో రోడ్డుమీదుగా ఊరేగించారు. అనంతరం ఆలయ ఆవరణలోని వేదికపై నృత్యకళాకారులు సంప్రదాయ నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామ సుబ్రహ్మణ్యం, నరేంద్ర చౌదరి, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, పరమేష్, భక్తులు పాల్గొన్నారు.

తీరిన తాగునీటి కష్టాలు



బోరుబావి నుంచి సమృద్ధిగా వస్తున్న నీరు

కనగానపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత పాళ్యం ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పాయని సర్పంచ్ పూజారి రాజాక్రిష్ణ తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉండటంతో ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి బోరుబావి తవ్వించారన్నారు. అందులో సమృద్ధిగా నీరు రావడంతో గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

లోపభూయిష్ట సహకారం..!

● అస్తవ్యస్తంగా డీసీఎంఎస్ ఆవరణం
● అనుమతి లేకుండా దుకాణాల నిర్మాణం
● నిబంధనలకు విరుద్ధంగా ఏడీసీసీ బ్యాంకులో షాపింగ్ కాంప్లెక్స్



డీసీఓ కార్యాలయ ఆవరణలో ఇష్టానుసారంగా వాహనాలు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సహకార రంగాన్ని పటిష్టం చేయాలని ప్రభుత్వం ఓ వైపు ప్రయత్నిస్తుంటే, దాన్ని బలహీనపరిచే లా అధికారుల తీరు ఉంది. ఇందుకు డీసీఎంఎస్, ఏడీసీసీ బ్యాంకు ఆవరణాల పరిస్థితి నిదర్శనంగా నిలుస్తోంది. అంతేగాకుండా డీసీఎంఎస్ ఆవరణ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మందుబాబులు విచ్చలవిడి గా మందు తాగుతున్నారు. ప్రైవేటు వ్యక్తులు ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేసి వెళుతున్నారు. ఆటోస్టాండ్‌ను తల పించేలా ఆటోలను నిలుపుతున్నారు. రైతులతో పాటు డీసీఓ, డీసీఎంఎస్ కార్యాలయాల్లో పనిచే సే అధికారులు, ఉద్యోగులు లోపలికెళ్లేందుకు ఇబ్బందిగి ఉంటోంది. ఇదిలా ఉంటే నిబంధనలకు విరుద్ధంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారంటూ ఏడీసీసీ బ్యాంకు అధికారులకు ఆర్‌బీఐ నోటీసులు జారీ చేసింది. అయినా ఆ బ్యాంకు అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా...

నగరంలోని ప్రధాన ప్రాంతమైన కమలానగర్‌లో డీసీఎంఎస్ కార్యాలయం ఉంది. అదే ఆవరణంలో జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) కార్యాలయం ఉంది. అయితే డీసీఎంఎస్ ఆవరణం మందుబాబులకు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇందుకు ఆవరణంలో పడిఉన్న మందు సీసాలు, ఇతర వస్తువులే నిదర్శనం. ప్రైవేటు వ్యక్తుల నిలిపే వాహనాలతో పార్కింగ్ ప్రాంతాన్ని తలపిస్తోంది. కార్యాలయానికి వచ్చే అధికారులు, ఉద్యోగులు, రైతులు నానా అవస్థలు పడు తున్నారు. ఇదిలా ఉంటే ఆటో స్టాండ్‌ను తలపించే విధంగా ఆటోలు నిలుపుతున్నారు. కార్యాలయం వాహనాలు, ఉద్యోగులు వచ్చేందుకు వీలు లేకుండా రోడ్డుకు అడ్డంగా పెట్టేస్తున్నారు. పై మూడు విషయాల్లో ఆవరణంలో పలుమార్లు గొడవలు సైతం జరిగాయి.

డీసీఎంఎస్‌లో నిబంధనలకు విరుద్ధం...

నగరానికి గుండెకాయలా ఉండే కమలానగర్‌లో 80 సెంట్ల డీసీఎంఎస్ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలను అద్దెకు ఇచ్చారు. నగరం నడిబొడ్డున రూ. 100కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలంలో సుమారు 14 దుకాణాలు నిర్మించి ఎటువంటి టెండర్లు, అగ్రిమెంట్లు లేకుండానే ఇష్టానుసారంగా అద్దెకిచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. దాదాపు అవన్నీ బినామీ పేర్లతోనే నడుస్తున్నాయనేది గట్టిగా వినిపిస్తున్న విమర్శ. ఇదిలాఉంటే అద్దె రూపంలో వస్తున్న మొత్తాన్ని ఏమిచేస్తున్నారనే ప్రధానంగా జరుగుతున్న చర్చ. వచ్చే అరకొర అద్దెకు లెక్కల్లేకుండా చేస్తున్నారు. దీంతో డీసీఎంఎస్ అధికారులు, సిబ్బంది పైనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కనీస బాధ్యత లేకుండా విలువైన స్థలాన్ని ప్రైవే టు వ్యక్తులకు ఎలా కట్టబెడుతున్నారం టూ విమర్శలు వినిపిస్తున్నాయి.



ఏడీసీసీ బ్యాంకు వద్ద నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్

ఏడీసీసీ షాపింగ్ కాంప్లెక్స్‌కు నోటీసులు

ఏడీసీసీ బ్యాంకు ఆవరణంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌పై అనేక ఆరోపణలు వస్తున్నాయి. బ్యాంకింగ్ నిబంధనలకు విరుద్ధంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారంటూ ఆర్‌బీఐ నోటీసులు జారీ చేసింది. ఏడీసీసీ బ్యాంకులో 2012 సంవత్సరంలో సుమారు 24 దుకాణాలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించా రు. వాటి నుంచి ప్రతి నెల సుమారు రూ. 10 లక్షలకు పైగా అద్దె వసూలు చేస్తోంది. ఇలాంటి కార్యకలాపాలు బ్యాంకు చేయకూడదని, కేవలం లావాదేవీలు చేయాలనే నిబంధనను ఆర్‌బీఐ విధించిన విషయం తెలిసిందే. ఆ 24 దుకాణాలతో పాటు పాత భవనంలో మరో రెండు దుకాణాలను అద్దెకు ఇచ్చారు. సుమారు 12 ఏళ్లుగా అద్దె వసూలు చేస్తున్నారు. అయితే అద్దె మొత్తాన్ని ఏ ఖాతాలో జమచేస్తున్నారో, నగదు ఎక్కడికి వెళ్తోందో అర్థంకాని పరిస్థితి. బ్యాంకు అధికారులు స్వాహా చేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. దుకాణాలు నిర్వహిం చరాదని, వెంటనే ఖాళీ చేయించి బ్యాంకు కార్యకలాపా లకు మాత్రమే వినియోగించాలని ఆర్‌బీఐ సూచించినా ఏడీసీసీ బ్యాంకు అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు గట్టిగానే వినిపిస్తున్నాయి.



డీసీఎంఎస్ ఆవరణలో పడి ఉన్న మద్యం సీసాలు

నిబంధనల ప్రకారమే నడుచుకోవాలి



సహకార వ్యవస్థ, బ్యాంకింగ్ వ్యవస్థ రెండూ సహకార నిబంధనలు, ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం నడుచుకో వాలి. సహకార చట్టం, ఆర్‌బీఐ నిబం ధనలకు విరుద్ధంగా ఎటువంటి కార్యకలాపాలు చేపట్టరాదు. డీసీఎంఎస్ ఆవరణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించాం. అనధికారికంగా డీసీఓ కార్యాలయం ఆవరణంలో బయటి వ్యక్తుల వాహనాలు పార్కింగ్ చేయరాదని ఇప్పటికే హెచ్చరించాం. ఇక డీసీఎంఎస్ ఆవరణంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేదు. ఆవరణంలోపల ఎటువంటి ప్రైవేటు వ్యక్తులకు ప్రవేశం ఉండదు. ఇక షాపింగ్ కాంప్లెక్స్ నిర్వహణపై ఏడీసీసీ బ్యాంకుకు ఆర్‌బీఐ నోటీసులు గురించి ఆ బ్యాంకు అధికారులే చూసుకుంటారు. ఏదైనా సరే ఆర్‌బీఐ నిబంధనల మేరకు బ్యాంకర్లు నడుచుకోవాల్సిందే.

-అరుణకుమారి, డీసీఓ

దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సర్వేశ్వరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో మార్చి 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 20వతేదిన మోడల్ స్కూల్‌లో ప్రవేశపరీక్ష నిర్వహిస్తామన్నారు. వివరాల కోసం రామగిరి మోడల్‌స్కూల్‌లోని కార్యాలయంలో సంప్రదించవచ్చున్నారు.

సంత ఆదాయం రూ.4.09 లక్షలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశులసంతతో మార్కెట్‌కు రూ. 4,09,230 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ. 2,46,430, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ. 1,62,800 వచ్చిందని తెలిపారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం : డీఎల్‌పీఓ

కనగానపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని డీఎల్‌పీఓ శివకుమారి పేర్కొన్నారు. మండలంలోని దాదులూరులోఆదివారం పర్యటించిన డీఎల్‌పీఓ ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇంటింటా చెత్తసేకరిస్తున్నారా లేదా అని ప్రజలతో ఆరా తీశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

అనంతపురం విద్య, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ టీచర్లకు ఆన్‌లైన్‌లో 40 రోజుల పాటు ఆంగ్లభాషపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు విల్ టు విన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ డైరెక్టర్ రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. స్థానిక లలితకళా పరిషత్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వందలాది మంది ప్రభుత్వ టీచర్లకు ఆదివారం ఒక రోజు ఓరియంటేషన్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా రామేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు తెలుగు మాట్లాడినట్టు ఇంగ్లీష్ మాట్లాడేలా చేయటమే దీని ఉద్దేశమయ్యాను. తెలంగాణా లో 33 జిల్లాలో 53 వేల మంది టీచర్లకు ఈ తరగతులు నిర్వహించామని పేర్కొన్నారు.

ఎంపీఈఓల సమస్యలను కేబినెట్‌లో ప్రస్తావిస్తా

● రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



మంత్రికి సమస్యలు వివరిస్తున్న ఎంపీఈఓల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఎంపీఈఓలకు మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేసే విషయాన్ని కేబినెట్‌లో ప్రస్తావించి న్యాయం జరిగేలా కృషి చేస్తానని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత హామీ ఇచ్చారు. ఎంపీఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, ఈసీ సభ్యులు రమేష్, సాంబశివ, ప్రశాంతి, నాగజ్యోతి, అపర్ణ, గీత, పద్మావతి, గాయత్రి ఆదివారం పెనుకొండలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో తమ సమస్యలను మంత్రికి వివరించారు. మంత్రి స్పందిస్తూ... సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. మంత్రి అచ్చెంనాయుడు, వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, కమిషనర్‌కు తన లెటర్ ప్యాడ్‌తో మెయిల్ ద్వారా లేఖలు పంపారు.

శివరాత్రి వేడుకల బ్రోచర్ల విడుదల

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అనంత శివారాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉదయం 6 నుంచి 27వ తేదీ ఉదయం 6 గంటల వరకు మూడో రోడ్డులోని గొంగడి రామప్ప కల్యాణమండపంలో నిర్వహించే మహాశివరాత్రి వేడుకలను విజయవంతం చేయాలని ఆ సమితి గౌరవాధ్యక్షుడు, విశ్రాంత తహసీల్దార్ పాలసముద్రం నాగరాజు పిలుపునిచ్చారు. కల్యాణమండపంలో ఆదివారం ఉత్సవాల బ్రౌచర్లను ఆవిష్కరించారు.

గ్రామాల్లో రోడ్ల సమస్య పరిష్కరిస్తున్నాం

● ఎమ్మెల్యే పరిటాల సునీత



సదాశివన్‌కాలనీలో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో గ్రామాల్లో రోడ్ల సమస్యలు లేకుండా చేస్తున్నామని ఎమ్మెల్యే పరిటాల సునీతఅన్నారు. మండలంలోని అక్కంపల్లి పంచాయితీలో మధురానగర్, సదాశివన్ కాలనీలో ఆదివారం రూ.50లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్లకు భూమి పూజ చేపట్టారు. ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరై రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. స్థానికంగా 250 కుటుం బాలు ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నామని, ఇళ్ల పట్టాలు వచ్చే విధంగా చూ డాలని సదాశివన్ కాలనీ వాసులు కోరారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాలనీలో ఉన్న మిగిలిన వారికి కొత్తగా ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అంగన్ వాడీ కేంద్రానికి నూతన భవనం నిర్మిస్తామన్నారు. పింఛన్లు, రేషన్‌కార్డులు, తాగునీటి సమస్య పరిష్కరిస్తామని, వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ పాలకులు గ్రామాల అభివృద్ధి గురించి మచ్చుకైనా ఆలోచించలేదన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ వెంకటనాయుడు, మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాముదాయి రఘు, మాజీ మండల కన్వీనర్ చల్లా జయకృష్ణ, మండల నాయకులు నారాయణస్వామి, ఇమాముల్, ప్రదీప్‌కుమార్, మస్తాన్, శ్రీనివాసులు, వెంకటనారాయణ, మారెన్న, వన్నూర్‌స్వామి, అమర్‌నాథ్, ఫకృద్దీన్, లాలు, గంగన్న, పోతన్న, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్క దేవతల పరుష



కొలువుదీరిన అక్క దేవతలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కంపల్లి సమీపంలో వెలసిన అక్క దేవతల పరుష మహోత్సవం ఆదివారం వైభవంగా సాగింది. శనివారం రాత్రి గొటుకూరు, కందుకూరు, రాచనపల్లి గ్రామాల నుంచి దేవతా గంపలు అమ్మవారి గుడికి చేరాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు బయలు గుడి దగ్గర అమ్మవార్లు కొలువు తీరి భక్తులకు దర్శనం ఇచ్చారు. చుట్టపక్కల గ్రామల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి.

సోషలిజం.. అనివార్యం: రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సమాజంలో సోషలిజం అనివార్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన 'రాజ్యం - విప్లవం' అనే పుస్తకంపై నిర్వహించిన సదస్సుకు రాంభూపాల్ హాజరై మాట్లాడారు. కార్మిక, రైతు, ఇతర వర్గాల ప్రజలందరినీ ఐక్యం చేసి దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఆసన్నమవుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నల్లప్ప, నాగేంద్రకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, వెంకట నారాయణ, ముత్తుజ, ఏజీ రాజమోహన్, నగర కమిటీ సభ్యులు మసూద్, రాజు, ఎర్రిస్వామినారాయణ, లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా విష్ణుకంటి ఆస్పత్రి ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి జేసీ దివాకర్ రెడ్డి

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని సాయినగర్ ఐదో క్రాస్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన న్యూరాలజీ, విష్ణు కంటి ఆస్పత్రి ప్రారంభోత్సవాన్ని ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. తొలుత వేదపండితుల చేత ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి చేతుల మీదుగా హాస్పెటల్‌ను ప్రాంభించారు. ఈసందర్భంగా జేసీ దివాకరరెడ్డి మాట్లాడుతూ తన మనవడు భరత్‌విష్ణురెడ్డి, మనవరాలు లీలాపద్మ పదేళ్లుగా అనంతపురంలోనే ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే 30పడకల ఆస్పత్రిని అన్ని వసతులతో ఏర్పాటుచేసి ప్రజలకు మరింత మంచి వైద్యసేవలు అందించడానికి ముందుకొచ్చినట్లు తెలిపారు. జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జేసీ కోరారు. కార్యక్రమంలో హాస్పెటల్ అధినేతలు డాక్టర్ భరత్‌విష్ణురెడ్డి డాక్టరు లీలాపద్మ, మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, కేశవరెడ్డి, డాక్టర్లు గుత్తా రవీంద్ర, కొండయ్య, మోహన్‌రెడ్డి, వంశీరెడ్డి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

అనంతపురం విద్య/క్లాక్‌టవర్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పూర్వవిద్యార్థులంతా ఒక్కటయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల చెట్టు నీడలో చదువుకున్న వారంతా... మరెక్కడో వేర్వేరుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. దాదాపు 45 ఏళ్ల తర్వాత కూడా ఒక చోట కలసి మధుర జ్ఞాపకాలను నెరమరేసుకున్నారు. అనంతపురం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల 1979-1981 బ్యాచ్ ఇంటర్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం వేడుకగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి అధ్యక్షతన జరిగిన వేడుకల్లో అప్పటి అధ్యాపకులు, విద్యార్థులు నాటి స్మృతులను ఒకరినొకరు పంచుకుని ఆనందించారు. పూర్వవిద్యార్థులు అప్పటి అధ్యాపకు లను ఘనంగా సన్మానించారు. ప్రస్తుత ప్రిన్సిపాల్, ఇన్‌చార్జ్ డీవీఈఓ రఘునాథరెడ్డి అధ్యక్షత వహించగా...పూర్వ అధ్యాపకులు నీలం హనుమంతరెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ పల్లె రామకృష్ణా రెడ్డి, విశ్రాంత ఆర్‌ఐఓ నరసింహులు నాయుడు, విశ్రాంత లెక్చరర్లు నర సింహారెడ్డి, అబ్బా శ్రీరాములు, పూర్వ విద్యార్థులు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఇంజనీరు సుధాకర్‌బాబు, పయ్యావుల రాధాకృష్ణ, బాల సత్యనారాయణ, నీలం గోపాలకృష్ణారెడ్డి పాల్గొని తమ అనుభవాలను, పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కళాశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



ఒక చోట కలిసిన 1979-81బ్యాచ్ ఇంటర్ విద్యార్థులు

మేడాపురంలో ...



అప్పటి టీచర్లతో పూర్వ విద్యార్థులు

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడాపురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఆదివారం పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. 2001-02 పదోతరగతి చదివిన విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల వేదికగా చేసుకుని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ముందుగా నాటి గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాలకు తమవంతుగా రేకులషెడ్డును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయంనుండి సాయంత్రం వరకు వారంతా పాఠశాలలో ఉత్సాహంగా గడిపారు.

సంక్షిప్త వార్తలు

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

బెళుగుప్ప, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ తండాకు చెందిన మైనర్ బాలిక అదృశ్యంపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. రెండు రోజుల నుంచి బాలిక కనిపించకపోవడంతో ఆమె తండ్రి రాయదుర్గం మండలంలోని గిరిజన తండాకు చెందిన ఓ వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశాడని, ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

యువతి అదృశ్యంపై..

ఉరవకొండ: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఆదివారం సాయంత్రం ఫిర్యాదు అందిందని ఎస్ఐ జనార్ధన్ నాయుడు తెలిపారు. తెల్లవారు జామున నుంచి కనపడటం లేదని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నియోజకవర్గ నాయకుడు వెంకటేష్ కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలని, సోమవారం నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు దీనిపై మాట్లాడాలని కోరారు. అసోసియేషన్ నాయకులు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

వినియోగంలోకి చిలమకూరు సబ్‌స్టేషన్

యల్లనూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తగా ఏర్పాటుచేసిన చిలమకూరు సబ్‌స్టేషన్ ఆదివారం నుంచి వినియోగంలోకి వచ్చింది. 20 రోజుల క్రితం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ప్రారంభించినప్పటికీ సిబ్బందిని నియమించకపోవడంతో సబ్‌స్టేషన్‌ను రన్ చేయలేదు. అయితే అధికారులు యల్లనూరు, వెన్నపూసపల్లి, కూచివారిపల్లి సబ్‌స్టేషన్లకు చెందిన పలువురి సిబ్బందిని ఇక్కడ తాత్కాలికంగా నియమించారు. దీంతో సబ్‌స్టేషన్ వినియోగంలోకి వచ్చింది. అలాగే ఆ స్టేషన్ కిందికి చిలమకూ రు, అచ్యుతాపురం, తిరుమలాపురం, కోడిమూర్తి గ్రామాలు చేరాయి.

విద్యార్థి మృతిపై విచారణ

గుత్తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట వీధిలో గల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన టెన్త్ విద్యార్థి వీరాచారి గత శనివారం సమీపంలోని రాజాబావిలో ఈతకు వెళ్లి మృతి చెందిన సంఘటనపై ఆదివారం డిప్యూటీ డీఈఓ శ్రీదేవి విచారణ చేపట్టారు. పాఠశాలకు వెళ్లి తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులతో వివరాలు సేకరించారు. అనంతరం బావి వద్దకు వెళ్లి పరిశీలించారు. అదే విధంగా మృతిచెందిన విద్యార్థి ఇంటి వద్దకు వెళ్లి తల్లిదండ్రులను పరామర్శించారు. ఎంఈఓ-2 మనోహర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

గుత్తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన శ్రీధర్ అనే వ్యక్తి ఆదివారం బైక్‌లో స్థానిక అనంతపురం రోడ్డులో వస్తుండగా.. ఆటో ఢీకొంది. ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఎంపిక

పుట్లూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా మండలంలోకి కడవకల్లుకు చెందిన రామాంజనేయులును ఎంపిక చేసినట్లు ఆ సంఘం నాయకులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. కడప నగరంలో జరిగిన ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభలో ఈ ఎంపిక జరిగిందన్నారు. రామాంజనేయులు ఇదివరకే కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

కూడేరు, ఫిబ్రవరి 23, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడదరకుంట గ్రామంలో జరిగిన ఘర్షణలో రెండు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలో గత కొంత కాలంగా తుప్పటి ఈశ్వరయ్యకు, దళితులైన పెద్దన్న, రమేష్ కుటుంబ సభ్యులకు మధ్య భూ వివాదం నడుస్తోంది. ఇందులో భాగంగా గత శనివారం తుప్పటి ఈశ్వరయ్య కుటుంబ సభ్యులు పొలంలో పనులు చేస్తుండగా, దళితులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. దాడి చేసుకోవడంతో ఇరు వర్గాల వారికి గాయాలయ్యాయి. తుప్పటి ఈశ్వరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు 15మందిపై, దళితులు రమేష్ భార్య ఆదిలక్ష్మి ఇచ్చిన మేరకు 15 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రెండు వర్గాల మీద కేసు నమోదు చేశామని, వివాదానికి కారణమైన భూమి వద్ద పోలీసుల పికెటింగ్ ఏర్పాటు చేశామని సీఐరాజు రాజు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

విడపనకల్లు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ గంగాధరగౌడ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుంచి మార్చి 31వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్ష ఫీజు ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు స్టడీ, కుల ధృవీకరణ సర్టిఫికెట్లతో మీసేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా దరకాస్తు చేసుకోవాలని సూచించారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి: సీఐటీయూ

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ నుంచి తొలగిస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఆదివారం సీఐటీయూ తాలూకా అధ్యక్షుడు వన్నూరుస్వామి అధ్యక్షతన మున్సిపల్ ఔట్‌సోర్సింగ్, పారిశుధ్య కార్మికులతో సమావేశం జరిగింది. నాగరాజుతో పాటు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ని తొలగించి ఏజెన్సీల ద్వారా ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ కార్మికులకు వేతనాలు ఇచ్చే ప్రయత్నం మానుకోవాలన్నారు. ఈ నెల 24వ తేదీన జరిగే బడ్జెట్ సమావేశంలో మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు తగు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో సమ్మెబాట పట్టడానికి వెనుకాడమని హెచ్చరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కార్పొరేషన్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు మున్సిపల్ కార్మికులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నగర అధ్యక్షుడు శివ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే ఉన్నత పాఠశాలలో 1999వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 25 ఏళ్ల తర్వాత అందరూ ఒకచోట కలవడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాటి ఉపాధ్యాయుడు ఖందరేను, ప్రస్తుత హెచ్‌ఎం మధుసూదన్‌ను శాలువాలు, పూలమాలతో సత్కరించారు.



నాటి ఉపాధ్యాయుడితో పూర్వ విద్యార్థులు

మహిమాన్వితుడు..

బుగ్గ రామలింగేశ్వరుడు

● స్వయంభుగా వెలసిన స్వామివారు ● శివలింగం కింద నిత్యం నీరు
● దక్షిణ కాశీగా తాడిపత్రికి పేరు ● ఆలయానికి ఘన చరిత్ర



ఆలయ ముఖ చిత్రం

తాడిపత్రి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రసిద్ధి శైవక్షేత్రాల్లో తాడిపత్రి బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం ఒకటి. ఇది దక్షిణ ఒడ్డున ప్రవహిస్తున్న పెన్నానది తీరాన ఉండడం విశేషం. ఇక్కడ శివుడు స్వయంభుగా వెలిసి రామలింగేశ్వరుడిగా కొలిచిన భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు. పార్వతీ దేవి రాజరాజేశ్వరి అమ్మవారిగా వెలిశారు. ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీరామ మందిరం, వీరభద్ర ఆలయం, కాశీవిశ్వేశ్వర లింగం తదితర ఉప ఆలయాలు దర్శనమిస్తాయి. అప్పట్లో గుత్తి- గండికోటను పరిపాలిస్తున్న పెమ్మసాని రామలింగనాయుడు 1490-1509మధ్య ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. పెన్నానది నుంచి 100అడుగుల ఎత్తులో ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. ఇక్కడ పెన్నానదిలో నీరు లేకపోయినప్పటికీ, ఏ కాలంలోనైనా శివలింగం చుట్టూ నిత్యం నీరు ఉబుకుతూ ఉండడం ప్రత్యేకత. ఈ నీరు ఎక్కడి నుంచి వస్తుందో అంతుచిక్కని రహస్యం. ఈ ఆలయంలో సప్తస్వరాలు అయిన సరిగమ పదనిసలు పలికే స్తంభం ఉండడం విశేషం. ఇప్పటికీ ఆ స్తంభాన్ని తాకి సరిగమపదనిస శబ్దాన్ని మనం వినవచ్చు.

రామలింగేశ్వరుడిగా శివుడు

లోకకల్యాణం కోసం మహర్షులు చేస్తున్న యాగాన్ని రక్షించడానికి శ్రీరాముడు వెళుతుండగా.. మార్గంమధ్యలో తాటకి అనే రాక్షసి అడ్డు తగిలింది. దీంతో తాటకిని సంహరించాలని విశ్వామిత్ర మహర్షి శ్రీరామున్ని ఆదేశించారు. ఆచార్యుడి ఆజ్ఞమేరకు శ్రీరాముడు తాటకిని సంహరించినట్లు ప్రతీతి. తాటకి మహిళ కావడంతో స్త్రీహత్య మహాపాపం అని ఆచార్యులు తెలిపారు. దీంతో శ్రీరాముడు పరిహారం కోరగా.. శివలింగ ప్రతిష్ఠ మాత్రమే ఈ పాపాన్ని హరించివేస్తుందని విశ్వామిత్రుడు తెలిపారు. దీంతో శ్రీరాముడు దక్షిణ ఒడ్డున పెన్నా నది పక్కన స్వయంభుగా వెలసిన శివలింగానికి ప్రాణ ప్రతిష్ఠ చేస్తారు. ఇక అప్పటి నుంచి బుగ్గరామలింగేశ్వరుడిగా స్వామివారు భక్తులకు దర్శనమిస్తున్నారు.

దక్షిణ కాశీగా తాడిపత్రి

భారతదేశంలో అత్యంత ప్రసిద్ధ శివాలయంగా ఉత్తరప్రదేశ్‌లోని వారణాశి (కాశీ) క్షేత్రం ఉంది. అక్కడ ఆలయానికి పక్కనే శ్మశానం, గంగానది ఉన్నాయి. ఆ విధంగానే తాడిపత్రిలో కూడా బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం పక్కనే పెన్నానది, శ్మశానం ఉండడం గమనార్హం. అందుకు ఈ ప్రాంతం దక్షిణ కాశీగా పేరుపొందింది. కాశీకి వెళ్లలేని వారు తాడిపత్రిలోని బుగ్గరామలింగేశ్వరున్ని దర్శించుకుంటారు.

ప్రదోషకాలంలో స్వామిని తాకే సూర్యకిరణాలు

ఉత్తరాయణం, దక్షిణాయంలోని చైత్రం, భాద్రపదమాసాల్లో స్వామివారిని ప్రదోషకాలంలో సూర్యకిరణాలు తాకుతాయి. ఈ సమయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేయడం గొప్ప ఫలితాన్ని ఇస్తుందని ఆలయ చరిత్ర చెబుతోంది.

మాఘ అమావాస్యరోజు కల్యాణోత్సవం

సాధారణంగా ప్రతి శివాలయంలో శివరాత్రి పర్వదినాన పార్వతీ సమేత స్వామివారికి కల్యాణం జరగడం ఆనవాయితీ. ఇక్కడ మాఘమాసం బహుళ అమావాస్యరోజున స్వామి, అమ్మవార్లకు వైభవంగా కల్యాణం జరుగుతుంది. స్థానికులే గాక కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణా నుంచి భారీగా భక్తులు వస్తారు.



బుగ్గ రామలింగేశ్వరుడు



రాజరాజేశ్వరి అమ్మవారు

మహాశివరాత్రికి పెద్దఎత్తున ఏర్పాట్లు

ప్రతిఏడాది మహాశివరాత్రి వేడుకలు ఇక్కడ పెద్దఎత్తున జరుగుతాయి. వేల సంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. ఈ సారి కూడా వేడుకలు భారీగా జరిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

భక్తుల కొంగుబంగారం స్వామివారు



భక్తుల కొంగుబంగారంగా బుగ్గరామలింగేశ్వరుడు విరాజిల్లుతున్నాడు. స్వామివారిని 41రోజులు ప్రదోషకాలంలో నియమనిష్టలతో కొలిస్తే.. వారి కోరికలు తప్పక నెరవేరుతాయి. ప్రతి ఏటా ఫిబ్రవరిలో వార్షిక బ్రహ్మోత్సవాలు 11రోజులపాటు అంగరంగ వైభవంగా జరుగుతాయి. కార్తీకమాసంలో కూడా విశేషపూజలు జరగడం ఆనవాయితీగా వస్తోంది.

-శంకరయ్య, ఆలయ ప్రధాన అర్చకుడు

పల్లెలను కూడా పరిశుభ్రంగా ఉంచుదాం: జేసీపీఆర్

తాడిపత్రి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టణాలే కాకుండా పల్లెటూళ్లను కూడా పరిశుభ్రంగా ఉంచాలన్నదే తమ ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సజ్జలదిన్నె గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించి అక్కడి ప్రజలు, పంచాయతీ అధికారులు, మున్సిపాలిటీ కార్మికులతో పారిశుధ్య పనులు చేయించారు. అలాగే గ్రామంలోని రహదారులకు అడ్డదిడ్డంగా ఉన్న బంకులు, అక్రమ కట్టడాలను తొలగింపజేశారు. పారిశుధ్య చర్యలు చేపట్టడంతో గ్రామమంతా పరిశుభ్రంగా తయారైంది. ప్రతి వీధిలోని మురుగు కాల్వల్లో పేరుకుపోయిన పూడికను కూడా తొలగింపజేశారు. అనంతరం జేసీపీఆర్ మా ట్లాడుతూ.. గ్రామంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న వాటిని తొలగించడం శుభపరిణామమన్నారు. గ్రామస్థులు సహాయ సహకారాలు అందించడం వల్లే ఇలా చేశామని చెప్పారు. పట్టణాలతో పాటు పల్లెలు కూడా పరిశుభ్రంగా ఉండాలనేది తన అభిమతమని చెప్పారు. ఇందుకు శాయశక్తులా కృషి చేస్తామని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి సహకారంతోనే పల్లెలను స్వచ్ఛంగా తీర్చిదిద్దడానికి ముందుకు వచ్చామని ఆయన పే ర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, కేశవరెడ్డి, గోపాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, హరినాథరెడ్డి, సంజీవపురం పవన్, కౌన్సిలర్లు విజ్జి, మల్లికార్జున, అబ్దుల్‌రహీం, జింకా లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.



మురుగు కాలువను శుభ్రం చేయిస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

నాడు ఫ్యాక్షన్.. నేడు భక్తి పరిమళాలు

● వెన్నపూసపల్లిలో ఆధ్యాత్మిక ప్రవచనాలు
● గ్రామ శాంతికోసం నాలుగురోజులుగా భాగవత సప్తాహం



భాగవత సారాంశాన్ని వివరిస్తున్న తులసిరెడ్డి

యల్లనూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నపూసపల్లిలో నాలుగు రోజులుగా పలువురు స్వామిజీలు, పండితుల ఆధ్యాత్మిక ప్రవచనాలతో భక్తి పరిమళాలు వెదజల్లుతున్నాయి. అప్పట్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ఫ్యాక్షన్ గ్రామం అంటే వెన్నపూసపల్లి అని మార్క్ ఉండేది. రోజులు మారడంతో గ్రామంలో భక్తి ప్రవచనాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. వెన్నపూసపల్లిలో గ్రామశాంతి కోసం జగద్గురు ఆది శంకరాచార్య భాగవత సమాజం ఆధ్వర్యంలో భాగవతా సప్తాహం చేపట్టారు. ఇందులో భాగంగా చివరి రోజు ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి రాజ్యసభ మాజీ సభ్యుడు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎన్. తులసిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో అన్ని ఉన్నా మనిషి ప్రశాంతత లేక మదనపడుతున్నాడని తెలిపారు. ఆధ్యాత్మిక ప్రవచనాలతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. నాలుగురోజులపాటు నిర్వహించిన ప్రవచనాలకు శ్రీశైలంతో పాటు తమిళనాడులోని తిరువణ్ణామలై (అరుణాచలం)కి చెందిన స్వామిజీలు, పండితులు హాజరుకావడం శుభపరిణామంగా గ్రామస్థులు భావించారు. మరోవైపు కార్యక్రమానికి గ్రామస్థులంతా హాజరు కావడంతో అందరిలోను ఆనందం వెల్లివిరిసింది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు భోగాతి నారాయణరెడ్డి, బాలకృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, శ్రీనివాసరావు, భోగాతి బాలనాగమ్మ, చెన్నకేశవరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, రమణ, నాగరాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకొత్తగా..

● పంచాయతీ కార్యాలయానికి నూతన హంగులు



కొత్త హంగులతో రూపుదిద్దుకుంటున్న పంచాయతీ కార్యాలయం

బెళుగుప్ప, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయానికి నూతన హంగులు అద్దుతున్నారు. 1965లో భవనం నిర్మించారు. మరమ్మతులకు నోచుకోక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పంచాయతీ సిబ్బంది విధులు నిర్వహించడానికి కనీస సౌకర్యాలు కూడా లేవు. మరుగుదొడ్లు కూడా లేకపోవడం శోచనీయం. కూటమి అధికారంలోకి రాగానే స్థానిక టీడీపీ నాయకులు.. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు. పరిష్కారానికి అడుగులు పడ్డాయి. సర్పంచ్ కార్యాలయం ముందు సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టారు. సమావేశ వేదిక మొదలగు సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకున్నారు. రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

గుత్తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్‌లో 220కేవీ ఏపీ ట్రాన్స్‌కోలో మెయింటెనెన్స్ పనుల కారణంగా సోమవారం ఉదయం 8 నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ డీఈఈ సాయిశంకర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కురుబల సమావేశం

ఉరవకొండ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గవిమఠం ఆవరణలో ఆదివారం కురుబ సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కులస్థులు పెళ్లిళ్లు జరుపుకునేందుకు అనువైన కళ్యాణమండపం ఏర్పాటుపై చర్చించారు. అందుకోసం అవసరమైన స్థలాన్ని కేటాయించాలని మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరడంపై తీర్మానం చేశారు. నాయకులు కుళ్లాయప్ప, లాలెప్ప, చాబాల ఈశ్వర్, బాళ్య ఈశ్వరయ్య, రమేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

విషపునీరు తాగి గొర్రెలు మృతి

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరవానితిప్ప గ్రామంలో ఆదివారం బొమ్మన్నకు చెందిన ఎనిమిది గొర్రెలు, ఒక మేక, రామాంజనేయులుకు చెందిన 12 గొర్రెలు, కోళ్ల తిప్పేస్వామికి చెందిన ఎనిమిది గొర్రెలు విషపునీరు తాగి మృతి చెందాయి. మేత కోసం జీవాలను గ్రామ పరిసరాలలోకి తీసుకెళ్లామని, అక్కడి ఓ తోటలో యూరియా కలిపిన నీటిని తాగి 28 గొర్రెలు, ఒక మేక మృతి చెం దాయని, మిగిలిన గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయని కాపరు లు వాపోయారు. పశువైద్యాధికారి నవీన్ కుమార్, సిబ్బంది సుధాకృష్ణప్ప, అశోక్ అస్వస్థతకు గురైన జీవాలకు చికిత్స చేశారు. జీవాల మృతితో రూ.మూడు లక్షల నష్టం వచ్చినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

గడ్డివామి దగ్ధం

కుందుర్పి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రంపల్లి గ్రామంలో ఆదివారం గడ్డివామి దగ్ధమైంది. విద్యుత్ లైన్ల రాపిడి వల్ల షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. అవి సమీపంలోని గంగన్నకు చెందిన గడ్డివామి మీద పడ్డాయి. దీంతో వాము మొత్త కాలిపోయింది. సుమారు రూ.20 వేలు నష్టం వాటిలినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

భారత్ విజయంపై సంబరాలు

కణేకల్లు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) ఛాంపియన్ ట్రోఫీలో భాగంగా ఆదివారం జరిగిన క్రికెట్‌మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై ఇండియా విజయం సాధించడంతో మండలకేంద్రంలో యువకులు సంబరాలు జరుపుకున్నారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచారు. ప్రతిష్ఠాత్మక టోర్నీలో పాకిస్థాన్‌ను ఇండియా చిత్తు చేయడం పట్ల ఆనందం వెలిబుచ్చారు.

బెంబేలెత్తిస్తున్న వన్యమృగాలు


● ఆందోళన చెందుతున్నరైతులు
● పట్టించుకోని అటవీ శాఖాధికారులు

శెట్టూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలో అడవి గొల్లపల్లి అటవీ ప్రాంత సమీప గ్రామాలైన కైరేవు, బసంపల్లి, అడవి గొల్లపల్లి, లింగదీర్లపల్లి గ్రామాల రైతులను వన్యమృగాలు బెం బేలెత్తిస్తున్నాయి. కొద్దిరోజులుగా అడవిలో అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో మంటలు తాళలేక వన్యమృగాలు సమీప గ్రామాల్లోకి చొరబడి అక్కడి పశువులపై దాడులకు పాల్పడుతున్నాయి. దీంతో వేలాదిరూపాయలు నష్టపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఖైరతారంలో చిరుత దాడి చేసి లేగదూడను చంపేసింది. అది మరువక ముందే బసంపల్లిగ్రామంలో పశువుల మందపై చిరుత దాడి చేసి గేదె దూడను చంపేసింది. వరుసగా చిరుత పశువులపై దాడులకు పాల్పడుతుంటంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని కంటిమీద కునుకులేకుండా ఉంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక అడవి పందులు, ఎలుగుబంట్లు, జింకలు తరచూ పంట పొలాల్లోకి చొరబడుతూ పంటలను నాశనం చేస్తున్నాయని వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా అటవీ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. అడవి జంతువుల దాడులతో పంటలతో పాటు పశుసంపదను కోల్పోవాల్సి వస్తోందని అంటున్నారు. వాటి నుంచి పంటలు, పశువులను కోల్పోయిన రైతులకు నష్టపరిహారం కూడా చెల్లించలేదని తెలుపుతున్నారు. జిల్లా అధికారులైనా స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, వన్యమృగాల బారి నుంచి పంటలను, పశువులను కాపాడాలని ఆయా రైతులు కోరుతున్నారు.



బసంపల్లిలో చిరుత దాడిలో మృతిచెందిన గేదెదూడ (ఫైల్)

భయాందోళనకు గురవుతున్నారు



రాత్రివేళల్లో చిరుత పశువుల మందలపై వరుసగా దాడి చేస్తోంది. దీంతో పశువులు ఉన్న రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టి వన్య మృగాల బారి నుండి కాపాడాలి.

-శ్రీనివాసులు, బసంపల్లి

అధికారులు చర్యలు తీసుకోవాలి



కొద్దికాలంగా గ్రామాల సమీపంలో ఉంటున్న పశువుల మందలపై చిరుత దాడి చే స్తోంది. అలాగే అడవిపందులు, జింకలు, ఎలుగుబంట్లు పంటపొలాపై పడుతున్నాయి. అడవిలో అగ్నిప్రమాదాల వల్లే అవి ఇలా బయటికి వస్తున్నాయి. ఇలా కాకుండా అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

-ఎర్రిస్వామి, కైరేవు

సింహవాహనంపై బుగ్గ రామలింగేశ్వరుడు



సింహవాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

తాడిపత్రి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు తొలుత మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తికి విశేష అలంకరణ చేసి సింహవాహనంపై కొలువుదీర్చి ఊరేగింపు చేశారు. భక్తులు పెద్దఎత్తున దర్శించుకున్నారు.

వైభవంగా చెన్నకేశవ స్వామి కల్యాణం



ప్రత్యేకాలంకరణలో ఉత్సవమూర్తులు

పెద్దవడుగూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. మాఘమాస దశమిని పురస్కరించుకుని ఉదయమే అర్చకులు ఆలయంలో శ్రీదేవి,భూదేవి సమేత స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి వేదమంత్రాలు, మేళతాళాల మధ్య కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

బ్రాహ్మణ సత్రానికి భూమి పూజ

కూడేరు, ఫిబ్రవరి 23, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జోడులింగాల సంగమేశ్వర స్వామి ఆలయ ఆవరణలో బ్రాహ్మణుల సత్రం నిర్మాణానికి పురోహితులు ఆదివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పురోహితులు సీవీ స్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీదేవికి తాళిబొట్టు అందజేత

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసాపురంలో గల లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి ఆదివారం గుంతకల్లు పట్టణానికి చెందిన పోలా గీతావాణి తాళిబొట్టు అందజేశారు. సుమారు రూ.లక్ష విలువ చేసే తాళిబొట్టును ఆమె ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు తలారి పరుశురాముడుకు అందజేశారు. అనంతరం ఆలయంలో స్వామిని దర్శించి పూజలు, అర్చనలు చేయించారు.

కమ్మ సేవా సంఘం కమిటీ ఎన్నిక

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పరిటాల శ్రీరాములు కల్యాణ మండపంలో ఆదివారం కమ్మసేవా సంఘం వారు సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో సంఘం పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోలూరు రామమూర్తి, ఉపాధ్యక్షుడిగా బండారు రమేష్, కార్యదర్శిగా గుండాల దామోదర్, సహాయ కార్యదర్శిగా కోనంకి అనిల్, కోశాధికారిగా టీ.వెంకటరమణ, సభ్యులుగా కడియాల రంగస్వామి, తమ్మినేని రాజేంద్రప్రసాద్, పొత్తూరు వెంకటనాయుడు, అల్లురవీంద్రనాయుడు, చింబిలి రాజశేఖర్, గుర్రం హరికృష్ణ, ఎస్కే గిరిబాబు, కందూరి దామోదర్, ఖాజీపురం రమేష్, కే రామకృష్ణను ఎన్నుకున్నారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వైటీచెరువు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు జీ.చెన్నప్ప అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ ఆదివారం ఆ గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. తర్వాత మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు.

విద్యార్థులకు బహుమతుల పంపిణీ

కుందుర్పి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్టు వారు ఇటీవల మండలవ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థులకు పిల్లల పండగలో భాగంగా పలు పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు ఆదివారం మండలకేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా ఎంఈవో తిప్పేస్వామి హాజర య్యారు. ట్రస్టు వ్యవస్థాపకుడు ఎస్కే లెనిన్‌బాబు, ఏపీటీఎఫ్ నాయకుడు తిమ్మప్ప, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి..

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రపంచ రోటరీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు పరీక్ష అట్టలను పంపిణీచేశారు. క్లబ్ అధ్యక్షుడు శివానంద, కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.